నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, శనివారం 5 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

కాల్వల్లో నీరు రావడం లేదు..

నేను రెండు ఎకరాలు వరి పంట సాగు చేశా.. పంట పొలాలకు వచ్చే కాల్వకు పూర్తి స్థాయిలో నీరు రాకపోవడంతో వేసిన రెండు ఎకరాల్లో ఎకరం ఎండి పోయింది. మిగతా ఎకరం కూడా పంట బాగానే పెరిగినా నీరు సక్రమంగా అందక మొత్తం తాలుగా మారింది. వారబంధి ద్వారా నీరు విడుదల చేయడం వల్ల పంటలకు నీరు సరిపోవడం లేదు. చేతికొచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతుంటే బాధేస్తున్నది. అయినా ప్రభుత్వం రైతుకు చేయూత నివ్వడం లేదు. ఎండిపోయిన పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటే బాగుంటుంది.

- నర్సింహులు, రైతు, కొత్తపల్లి, గద్వాల జిల్లా

గద్వాల జిల్లా కొత్తపల్లి శివారులో ఎండిన వరి పంట

ఆశలన్నీ ఆవిరాయే..!

- గద్వాల జిల్లాలో సాగునీళ్లు రావాయే.. పంటలు ఎండిపోయే..
- వంతుల వారీగా ప్రాజెక్టుల నీళ్లు పారించుకుంటున్న వైనం
- పట్టించుకోని ప్రభుత్వం.. ఆందోళనలో రైతులు

గద్వాల, ఏప్రిల్ 4 : యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు వారబంధి పద్ధతిలో ఏప్రిల్ 15వ తేదీ వరకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని అధికారులు, ప్రభుత్వం చెప్పింది. ఈ మాటలు నమ్మిన రైతులు యాసంగిలో జోగుళాంబ గద్వాల జిల్లాలో వాణిజ్య పంటలతో పాటు వరి సాగు చేశారు. అయితే ఎగువ నుంచి వచ్చే నీరు పూర్తి స్థాయిలో రాకపోవడంతో ప్రాజెక్టుల్లోని నీరు అడుగంటిపోవడంతో.. సాగు చేసిన చివరి పంటలకు సాగు నీళ్లు అందని పరిస్థితి తలెత్తింది. దీంతో పంట కళ్ల ముందే ఎండిపోతుంటే తల్లడిల్లిపోతున్నారు. తమ పంట పొలాలకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేసినా.. ప్రజా ప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేకుండాపోయింది. కర్ణాటక ప్రభుత్వాన్ని మన జిల్లా మంత్రితోపాటు ఎమ్మెల్యేలు కలిసి పంటలకు సాగునీరు ఇవ్వాలని కోరగా అందుకు వారు సానుకూలంగా స్పందించినప్పటికీ అనుకున్న స్థాయిలో నీళ్లు విడుదల చేయడం లేదని రైతులు వాపోతున్నారు. కాగా అధికారులు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న అరకొర నీటిని విడుదల చేస్తూ పంటలకు పూర్తి స్థాయిలో నీరు ఇస్తున్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. గద్వాల మండలం కొత్తపల్లి, బీరెల్లి, లత్తిపురం తదితర గ్రామాల్లో సుమారు 950 ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. అయితే అధికారులు కాల్వకు వదిలే నీరు తక్కువ స్థాయిలో వదలడంతో చివరి పంటలకు సాగునీరు అందక పోవడంతో సాగు చేసిన పంటల్లో సగభాగం పంటలు ఎండిపోయాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిన పంట పొలాలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు చెప్పిందొకటి.. చేస్తున్నది మరొకటి..

ఏప్రిల్ 15 వరకు రైతులు సాగు చేసిన పంటలను ఎండనివ్వకుండా పూర్తి స్థాయిలో పంటలకు నీరు అందిస్తామని అధికారులు చెప్పడంతో వారి మాటలు నమ్మిన రైతులు జూరాల ప్రాజెక్ట్ కుడి కాల్వ కింద వరిని సాగు చేశారు. కర్ణాటక ప్రభుత్వం 4 టీఎంసీలు విడుదల చేస్తానని చెప్పి ఒక టీఎంసీ నీటిని మాత్రమే విడుదల చేయడంతో ఇచ్చిన మాట ప్రకారం అధికారులు నీటిని విడుదల చేయలేకపోతున్నారు. అయితే మొదట వారబంధి పద్ధతిలో వారానికి నాలుగు రోజులు నీటిని విడుదల చేసిన సమయంలో రైతులకు ఎంటువంటి ఇబ్బంది లేదు. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గిపోవడంతో అధికారులు దానిని మూడ్రోజులకు కుదించారు. తర్వాత రెండ్రోజులకోసారి.. నీటిని విడుదల చేయడం మొదలు పెట్టారు. అయితే వదిలే నీరు కాల్వలకే సరిపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లకపోవడంతో పంటలు ఎండి పోయాయి. ప్రస్తుతం వారానికి ఒక టిన్నర రోజు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో పంట పొలాలకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. నీళ్లొచ్చిన సమయంలో ఒక రైతు ఎకరాకు 3 గంటలే నీరు పారించుకోవాలన్న నిబంధనలు పెట్టు కోవడం వల్ల ఎకరా వరకు పంటకు నీళ్లు అందుతాయి. కానీ ఎక్కువ ఎకరాలు సాగు చేసిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంట చేతికొచ్చిన సమయంలో ఎండిపోతుండడంతో పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు తడుల వరకు సాగునీరు అందిస్తే తమ పంటలు పండుతాయని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

యాసంగి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. చాలా చోట్ల చెరువులు, ప్రాజెక్టులు అడుగంటగా.. భూగర్భ జలాలు తగ్గి బోర్లు వట్టిబోగా.. వరితోపాటు ఇతర పంటలు ఎండిపోతున్నాయి. వనపర్తి జిల్లాలో లక్షా 80వేల ఎకరాల్లో వరి సాగైంది. జూరాల, భీమా కాల్వల కింద నీటి సమస్య తక్కువగా ఉన్నా.. బోరుబావుల కింద నమ్ముకొని పంటలు సాగు చేస్తే రైతులను నష్టాల పాలు చేశాయి. చేతికందే దశలో పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలన్న తాపత్రాయంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి పొలాలను తడుపుతున్నారు. అయినా సరిపోక పంటలు ఎండుతుండడంతో చేసేది లేక పశువుల మేతకు వదిలేస్తున్నారు.

– వనపర్తి, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)

బోరు ఎండిపోవడంతో ట్యాంకర్ నీటిని పొలానికి పారిస్తున్న రైతు దేవ్లా నాయక్

చివరి ప్రయత్నంగా..

కందిరీగ తండాలో ఎండిన వరిని పశువులకు మేపుతున్న రైతు మన్యంనాయక్

కందిరీగ తండాలో ఎండిన వరిని పశువులకు మేతగా కోస్తున్న గిరిజన మహిళా రైతు మంగ్లీ

- వనపర్తి జిల్లాలో పంటలకు ట్యాంకర్ల నీరే దిక్కు
- కాపాడుకునేందుకు తాపత్రయం
- తడిలేక ఎండుతున్న పంటలు
- అప్పులే మిగిలాయని నిట్టూరుస్తున్న రైతులు

వనపర్తి మండలంలో కందిరీగ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గిరిజనులు యాసంగిలో పంటలను సాగు చేశారు. ప్రధానంగా వరి పంటకు ప్రాధాన్యత నిచ్చారు. వానకాలంలో అధికంగా వర్షాలు రావడం.. అలాగే గత నెల వరకు చెరువులు, కుంటల్లో నీరుండటం వల్ల బోరు, బావులు కూడా ఓ మోస్తరుగా పనిచేశాయి. ప్రస్తుతం ఆ తండాలో వరి చేలన్నీ ఎండిపోతున్నాయి. చాలా వరకు బోర్లపై ఆధారపడి సేద్యం చేస్తున్నారు. తండా సమీపంలోనే మశ మ్మ చెరువు ఉన్నది. ఆ చెరువులో నీళ్లున్నంత వరకు ఈ గిరిజన రైతులకు నీటి సమస్య రాలేదు. ఇక ఆ చెరువులో నీళ్లన్నీ ఇటీవల పక్షం రోజుల కిందట పూర్తిగా అయిపోయి.. చెరువు ఎండినంత పని జరిగింది. దీంతో గిరిజన రైతులకు కష్టాలు మొదలయ్యాయి.

ట్యాంకర్లతో నీటిని కొట్టినా..

కందిరీగతండాలో కొందరు రైతులు ట్యాంకర్లను పెట్టి వరి చేలకు నీళ్లు కొట్టినా ఫలితం దక్కడం లేదు. చేతికి వచ్చిన చేలు కండ్ల ముందు ఎండిపోతుంటే.. చూడలేక రైతులు ట్యాం కర్ నీటితోనైనా బతికించుకుందామని ఆరాట పడుతున్నారు. అయినా ఆ ట్యాంకరు నీరు ఏ మూలకు సరిపోవడం లేదు. మడిలో వదిలిన నీరు ముందుకు పోవడం లేదు. దీంతో ఈ ప్రయత్నాలు కూడా రైతులకు సఫలం కానందున దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రోజు పది ట్యాంకర్లు మడిలో పోసినా ఒక్క మడి కూడా తడవడం లేదని గిరిజన రైతులు లబోదిబో మంటున్నారు.

ఒకే చోట పది ఎకరాలు..

కందిరీగ తండాలో ఒకే ప్రాంతంలో పది ఎకరాల వరకు యాసంగి వరి చేతికి వచ్చే దశలో బోర్లు నీళ్లు పోయక రైతుల నుంచి చేజారిపోతుంది. ఈ పరిస్థితిలో చేలను చూసిన వారెవరికైనా మనస్సు తరుక్కుపోతుంది. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి కండ్ల ముందు ఎండిపోతున్నా పంటలను చూస్తుంటే.. ఏమీ చేయలేని నిస్సాహాయతలో కొట్టుమిట్టాడుతున్నారు. తండాకు చెందిన మోతీలాల్ పొలం 2 ఎకరాలు, దేవీసింగ్ 2 ఎకరాలు, శంకర్ 2 ఎకరాలు, దేవ్లా ఎకరన్నర, మంగ్లీ ఎకరా, కోటయ్యలకు చెందిన ఎకరన్నర వరి పొలం నీళ్లు లేక ఎండిపోయింది. ఎండిన పొలాలు ఒక వైపు.. ట్యాంకరుతో నీళ్లు పడుతుండడం మరో వైపు.. పశువులకు మేతగా వరిని కోస్తున్న దృశ్యాలు ఇంకోవైపు చూస్తుంటే రైతుల గుండెలు తట్టుకోలేకపోతున్నాయి.

మమ్మల్ని ఆదుకోవాలంటున్న రైతులు..

వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి చివరి దశలో తీవ్రంగా నష్టపోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కందిరీగతండా గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మూడు నెలలకు పైగా వరి చేలను కాపాడుకుంటే.. ఇలా తమ కండ్లముందు ఎండుతున్న చేలను చూసి జీర్ణించుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలకు పైబడి ఖర్చువుతుందని, మళ్లీ మా మూడు నెలల కష్టం కూడా ఇందులోనే ఉం టుందని, ఇలా మమ్మల్నీ నట్టేట ముంచినట్లు జరిగితే ఎలా బతకాలని గిరిజనులు బావురుమంటున్నారు. ఆశపడి పంట పండుతుంది అనుకున్నాం.. కానీ.. చివరకు ఇలా అయిదనుకుంటే సేద్యం చేసేవాళ్లమే కాదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సర్కారు సహకారం చేయాలి

భూమిని నమ్మి సేద్యం చేసుకున్నం. వానకాలంలో వానలు బాగా వచ్చినయి. మా దగ్గరున్న చెరువు నిండుగా ఉండింది. అప్పుడు మాబోర్లు కూడా నీళ్లు బాగానే పోసినయి. కానీ,ఉన్నట్లుండీ చేలు చేతికి వచ్చినప్పుడు చుక్క నీరు కొట్టకుండా బోర్లు ఎండిపోయినవి. ఈ పరిస్థితిలో మమల్ని సర్కారు ఆదుకోవాలి. గతంలో నాకు ఎప్పుడు ఇలా జరగ లేదు. రెండుసార్లు బోరు కాలిపోతే చేయించుకున్నా.. అన్ని కలిపి మమ్మల్ని మరింత అప్పులోకి నెట్టిశాయి.

- మోతీలాల్, గిరిజన రైతు, కందిరీగతండా, వనపర్తి మండలం

గద్వాల జిల్లాలో కాల్వలో తక్కువగా పారుతున్న జూరాల ప్రాజెక్టు నీళ్లు

కౌలుకు తీసుకొని ఎనిమిదెకరాలు సాగు

ఎకరాకు రూ.12 వేలకు కౌలుకు తీసుకొని 8 ఎకరాల్లో వరి సాగు చేశా. ప్రస్తుతం రెండెకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయింది. మిగతా పంటకు నీరు పారించడానికి రాత్రీ పగలు భార్యా పిల్లలం పొలం దగ్గరే ఉండి నీరు పారించుకుంటున్నాం. అయినా పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు పంటపై రెండున్నర లక్షల పెట్టుబడి పెట్టా. రెండెకరాలు పూర్తిగా ఎండిపోవడంతో ఇప్పటికే రూ.60 వేలు నష్టపోయాను. ఉన్న పంటను కాపాడుకుందామంటే కాల్వకు పూర్తి స్థాయిలో నీరు రావడం లేదు. వచ్చిన అరకొర నీటి కోసం రైతులు తమ పొలాలకు పారించుకోవడానికి కొట్లాడు కుంటున్నారు. ప్రతి రైతు ఎకరాకు 3 గంటలే నీరు పారించుకోవాలన్న నిబంధన పెట్టారు. అయితే తాను సాగు చేసిన ఎనిమిది ఎకరాలకు నీరు ఎలా అందుతుంది.కాల్వకు ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేస్తే రైతులందరికీ సరిపోతాయి. ఆ దిశగా అధికారులు కృషి చేయాలి. మరో రెండు తడుల వరకు సాగునీరు ఇవ్వాలి.

- ఈశ్వరన్న, రైతు, కొత్తపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా

జూరాల నుంచి సాగునీళ్లివ్వండి

- మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి నందిమళ్ల రైతుల విజ్ఞప్తి

అమరచింత, ఏప్రిల్ 4 : పొట్టదశకు వచ్చిన వరి పంటకు సాగునీరు సకాలంలో అందకపోవడంతో వడ్లు తాళ్లుగా మారిపోతాయని, దయచేసి ఇంకా రెండు వారాలపాటు పంటలకు సాగునీరు అందించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి నందిమళ్ల గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వచ్చిన ఎమ్మెల్యేను రైతులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహులు, భాస్కర్‌రెడ్డి, రాజు కలిశారు. ఎడమ కాల్వ పరిధిలో నందిమళ్ల, మూలమాళ్ల, మన్నీపూర్ శివారులో రైతులు సాగు చేసిన వరి పంటలు ఇప్పుడు పొట్టదశలో ఉన్నాయన్నారు. ఇప్పటికే వారబంధి ద్వారా నాలుగు రోజులకోసారి సాగునీరు వదలడంతో పంటలు తడి ఆరిపోతున్నాయని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యేప్రాజెక్టు ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి ఎడమ కాల్వకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. డ్యాంలో తాగునీటి అవసరాలకు మా త్రమే నిల్వలు ఉన్నాయని చెప్పడంతో కనీసం లీకేజీ నీరైనా కాస్తా ఎక్కువగా విడుదల చేస్తే మోటర్లు పెట్టుకుని రైతులు పంటలను కాపాడుకుంటారని సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాసులు, బాల్ రాం, మైనొద్దీన్, రాజు, చంద్రశేఖర్, గోవింద్ ఉన్నారు.

రైస్‌మిల్‌లో విజిలెన్స్ దాడులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 4 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామంలోని బాలాజీ రైస్ మిల్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం సాయంత్రం దాడులు చేశారు. దాదాపు 320 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. గతంలోనూ ఈ మిల్ యాజమానిపై కేసులు ఉన్నట్లు సివిల్ సప్లయి అధికారి హేమ్లానాయక్ తెలిపారు. బాలాజీ రైస్‌మిల్‌కు పీడీఎస్ రైస్ అనుమతులు లేవని, అక్రమంగా నిల్వ చేశారన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్టాక్ పాయింట్‌కు తరలించారు. రైస్‌మిల్స్‌లో ఎవరైనా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో అధికారులు ఉన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన బొప్పాయి తోట

కొండపల్లిలో వర్ష బీభత్సానికి దెబ్బతిన్న బొప్పాయి తోట

గద్వాల రూరల్, ఏప్రిల్ 4 : మండలంలోని కొండపల్లి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి బొప్పాయి, మిరప, వరి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. పది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొండపల్లిలో నర్సింహులు, దామోదర్, సుంకన్న, జగదీశ్ తదితరులు దాదాపు 30 ఎకరాల్లో బొప్పాయి పంట సాగుచేశారు. గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించడంతో చెట్లు విరిగి కిందపడ్డాయి. కోతకు వచ్చిన కాయలన్నీ నేల మట్టం అయ్యాయని బాధిత రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న బొప్పాయి తోటను ఉద్యానవన అధికారి రాజేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించి రైతుల వివరాలు తెలుసుకున్నారు. పంటలు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

యువకుడిపై సామూహిక దాడి

- పరిస్థితి విషమం.. దవాఖానకు తరలింపు
- ప్రేమ వ్యవహారమే కారణం

నవాబ్‌పేట, ఏప్రిల్ 4 : మండలంలోని పల్లెగడ్డకు చెందిన అరవింద్(24)పై జిల్లా కేంద్రానికి చెందిన కొంత మంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేయడం సంచలనంగా మారింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్లెగడ్డకు చెందిన అరవింద్, మహబూబ్‌నగర్‌లోని పాత పాలమూరుకు చెందిన ఓ యువతి రెండేండ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. కొంతకాలం నుంచి ఇరు కుటుంబాల మధ్య సఖ్యత కుదరకపోవడంతో మాట్లాడుకుందామని జిల్లా కేంద్రం నుంచి సుమారుగా 10మంది వ్యక్తులు శుక్రవారం పల్లెగడ్డకు వచ్చి అరవింద్‌ను గ్రామ శివారులోకి పిలిచి మూకుమ్మడిగా దాడి చేసి చితక బాదారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకునే లోపే దాడి చేసి వాహనాలను వదిలిపెట్టి పరారయ్యారు. దాడిలో స్పృహ కోల్పోయి అపస్మారకస్థితిలో ఉన్న అరవింద్‌ను 108లో జిల్లా దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరగా, ప్రేమ వ్యవహారంలోనే దాడి జరిగి ఉంటుందని తెలిపారు. దాడి చేసిన వారి వాహనాలను అదుపులోకి తీసున్నామని, వారు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- నాగర్‌కర్నూల్, ఊట్కూర్‌లో ముస్లింల భారీ నిరసన ర్యాలీ

నాగర్‌కర్నూల్/ఊట్కూర్/కల్వకుర్తి, ఏప్రిల్ 4 : వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహెమాన్, ముస్లిం నాయకుడు మహ్మద్ హబీబ్‌ఖాన్, ముస్లిం హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మహ్మద్ నిజాం, వక్ఫ్ కాంప్లెక్స్ కమిటీ కార్యదర్శి పఠాన్ అబ్దుల్లాఖాన్, బీఎస్‌పీ నాయకుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ దేవుడికి అంకితం చేస్తూ ముస్లిం దాతలు ఇచ్చిన భూములు వక్ఫ్‌బోర్డు పరిధిలో అనాదిగా ఉన్నాయన్నారు. వక్ఫ్ ఆస్తులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై ద్వేషంతో బడాబాబులకు అంటగట్టడానికి చట్టంలో మార్పు లు తీసుకొని వస్తుందన్నారు. పేదలకు చెందాల్సిన భూములను లాక్కోవడం ద్వారా ముస్లింలను ఆర్థికంగా బలహీనులను చేసి రాజకీయంగా, సామాజికంగా ఎదగకుండా చేయాలన్నది బీజేపీ లక్ష్యమని వారు ఆరోపించారు. ఊట్కూర్ మండల కేంద్రంలోనూ ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించి తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాసీల్దార్ చింత రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఐహెచ్ నాయకులు అబ్దుల్ ఖయ్యూం, మండల అధ్యక్షుడు మన్సూర్ అలీ, ఎంఐఎం నగర అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్, సీపీఐ (ఎంఎల్-మాస్‌లైన్) జిల్లా నాయకుడు సలీం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీల ఆస్తులకు రక్షణగా ప్రత్యేక వక్ఫ్ చట్టాన్ని రాజ్యాంగం అమలు చేసిందని, మోదీ ప్రభుత్వం ముస్లింలను అణగదొక్కేందుకు ఈ చట్టాలనికి సవరణలు చే యాలని చూస్తున్నదని, దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వక్ఫ్ బిల్లు ను వ్యతిరేకిస్తూ కల్వకుర్తి పట్టణంలోనూ ము స్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతోపాటు, హోం మంత్రి, సీఎం లు చంద్రబాబు, నితీశ్‌కుమార్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం ఆర్టీవో శ్రీనూనాయక్ కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా ఊట్కూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఇసుక తవ్వకాలను చేపట్టనివ్వం

తాడూరు, ఏప్రిల్ 4 : దుందుభీ నదిలో ఇసుక తీసినట్లయితే భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయం చేసుకోలేక జీవనోపాధి కోల్పోయే అవకాశం ఉందని. అందుకే ఇసుక తవ్వకాలు చేపట్ట నివ్వమని ఏటిధర్‌పల్లి వాసులు పోలీసులకు తెగేసి చెప్పారు. మండలంలోని ఏటిధర్‌పల్లి సమీపంలోని దుందుభీ నదిలో ఇసుక రీచ్ కోసం ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే 15,20 రోజులుగా గ్రామస్తులు ఇసుక అనుమతులు రద్దు చేయాలని ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్సైలు 15 మంది కానిస్టేబుళ్లు, రెవెన్యూ ఆర్ఐ, మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక రీచ్ ఏర్పాటు చేసుకునేందుకుగాను సహకరించాల్సిందిగా కోరగా గ్రామస్తులు ససేమిరా అన్నారు. మా ప్రాణాలు పోయినా సరే ఇసుక రీచ్‌ను మాత్రం ఏర్పాటు చేయనిచ్చేది లేదంటూ పోలీసులకు తేల్చిచెప్పారు. గ్రామంలో ఉన్న రైతులందరూ దుందుభీ నదిని న మ్ముకుని కిలో మీటర్ల మేర నదిలో నుంచి పైపులైన్ల ద్వారా సాగునీరు పారబెట్టుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అప్పటికే మన ఊరు-మన ఇసుకకు సంబంధించి దాదాపు పది ట్రాక్టర్ల మేర గ్రామానికి రావడంతో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వెంటనే గ్రామస్తులందరూ ఎట్టి పరిస్థితుల్లోను ఇసుక తీసుకెళ్లకూడదని సూచనలు చేయడంతో అధికారులు రెండు మూడు రోజుల్లో గ్రామస్తులందరూ ఆలోచన చేసుకొని ఎక్కడో ఒక దగ్గర రీచ్ ఏర్పాటుకు సహకరించాల్సిందిగా సూచించారు. అయితే మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఇసుకను తీసుకెళ్లాలని ఆలోచన చేస్తుండడంతో అదేస్థాయిలో ఇసుకను తరలించే ప్రసక్తే లేదంటూ ప్రజలు కంకణం కట్టుకున్నారు.

మన్నీపూర్‌లో ఐజీ రమేశ్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీజీపీ జితేందర్

నేర రహిత సమాజం నిర్మిద్దాం

- డీజీపీ జితేందర్

అమరచింత/ధరూర్, ఏప్రిల్ 4 : నేరరహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని డీజీపీ జితేందర్ సూచించారు. గురువారం అమరచింత మండలంమన్నీపూర్‌లో ఐజీ రమేశ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సొంత గ్రామమైన మన్నీపూర్‌లో 36 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా వాటిని డీజీపీ జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం మొత్తంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడంతో చైనా మొదటి స్థానంలో, లండన్ రెండో స్థానంలో ఉండ గా, భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండగా, అందులో మొదటి స్థానంలో హైదారబాద్‌గా చెప్పుకోవచ్చని అన్నారు. తాను 1997లో మహబూబ్‌నగర్ ఎస్పీగా పనిచేశానని అప్పటితో పో ల్చుకుంటే ఇప్పుడు నేరాలు చాలా వరకు తగ్గిపోయాయని అం దుకు ప్రదాన కారణం సీసీ కెమెరాల ఏర్పాటేనని అందుకే ప్రజలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం జూరాల ప్రాజెక్టు సమీపంలో పోలీస్ అవు ట్ పోస్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదూవిధంగా ధరూర్‌లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డీజీపీ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పోలీసు హౌసింగ్ బోర్డు చైర్మన్ గురునాథ్‌రడ్డి, హైదారబాద్ మల్టీ జోన్ ఐజీపీ సత్యనారాయణ, జోగుళాంబజోన్ డీఐజీ ఎల్‌హెచ్ చౌహాన్ పాల్గొన్నారు.